విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

16 నుంచి ఈవిఎంల ఫస్ట్ లెవెల్ చెక్

విశాలాంధ్ర-భీమవరం: ఈ నెల 16వ తేదీ నుండి 40 రోజులపాటు ఈవీఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వ హించనున్నట్టు, గుర్తింపు పొందిన రాజ కీయ పార్టీల ప్రతి నిధులు తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఈవిఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరిగే విధానంపై పూర్తిగా వివరించారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ కోసం పక డ్బందీగా ఏర్పాట్లును చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం గం.9నుండి సాయంత్రం 7 వరకు జరుగు తుందని, 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తామని, ఆయా టేబుళ్లలో డిటి, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్లను ఉంచనున్నామన్నారు. బెల్ కంపెనీ నుంచి 12 మంది ఇంజనీర్లు వస్తారని, వారి ఆధ్వర్యంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్వో కె. కృష్ణవేణి, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతలో దేశ సమైక్యతను పెంచడానికే
నా మట్టి- నా భూమి
జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: యువతలో దేశ సమైక్యతను, సమగ్రతను పెంపొందిం చేందుకే నా మట్టి - నా భూమి కార్యక్రమంలో మట్టి సేకరణ చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా మట్టి-నా భూమి కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా సేకరించిన మట్టితో నింపిన కలశాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరాయి. దీనిని పురస్కరించుకొని స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో కలశాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జన్మభూమిపై మమకారంతో పాటు, నాటి స్వాతంత్ర్య సమరయోధుల నుండి స్ఫూర్తిని పొందాలన్నారు. జిల్లా కేంద్రంలో వున్న మట్టికలశాన్ని ఈనెల 22 వ తేదీ ఈనెల 27 మధ్య రాష్ట్ర ప్రధాన కేంద్రానికి చేర్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్,జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.కె మురళీకృష్ణ, జిల్లా కలెక్టరు కార్యాలయం ఏవో వైకెపి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి మండలం చనుబండ పంచాయతీ సూరంపాలెం గ్రామానికి చెందిన వెల్ది నాగేశ్వరరావు భార్య వరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె వున్నారు. శనివారం ఆమె మరణవార్త తెలియడంతో తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పరసా శ్రీనివాసరావు, సిపిఎం చాట్రాయి మండల నాయకులు చాగంటి రాజారావు, కొత్త గూడెం మాజీ సర్పంచ్ చల్లగుళ్ళ రాజారత్నం, వెల్ది నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు ములగలపాటి శ్రీనివాసరావు, వనమా వాసు, చనుబండ పంచాయతీ ఉప సర్పంచ్ చిన్న బాబు, తదితరులు ఆమె భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

త్రివిధ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర-నూజివీడు :పరీక్ష మీద చర్చ కార్యక్రమంలో దేశ ప్రధానితో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న నూజివీడు త్రివిధ స్కూలు విద్యార్థులకు ప్రధాని నుండి ప్రశంసా పత్రాలు అందాయి. పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు అక్కినేని లాస్యశ్రీ,నేరెళ్ళ నాదప్రియ,అవలరెడ్డి పవన్‌కుమార్‌లకు ఈ ప్రశంసా పత్రాలు అందాయి.ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సబ్బినేని శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్యుప్రెషర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కలిదిండి : ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఆక్యు ప్రెషర్ అయస్కాంత చికిత్స శిబిరం కళ్యాణి ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పూర శ్రీధర్, టౌన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఎంపీటీసీ సభ్యులు నీలి. సుమన్ శనివారం తెలిపారు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంస్థాన్, హనుమాన్ గడ్ (రాజస్థాన్) ఆక్యు ప్రెషర్ థెరపిస్ట్ వైద్యులుతన్ రాజు చౌదరి, రేవంత్ చౌదరి పరివేక్షణలో వైద్య పరీక్షనిర్వహించబడతాయన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు ప్రారంభిస్తారని అన్నారు. 6 రోజుల శిబిరంలో రిజిస్ట్రేషన్ ఫీజు చేల్లించి వివరాలకు చక్క జగన్ మోహన్ రావు సెల్ నంబర్: 9848 50 5339 వివరాలకు సంప్రదించాలని వారు కోరారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యేంద్ర బాబు

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: నూతనంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన గౌతు సత్యేంద్ర బాబును నియమించినట్లు పార్టీ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రకటన విడుదల చేసినట్లు గౌతు సత్యేంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గత 13 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో అనేక స్థాయిలలో పనిచేసిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులుగా గుర్తింపు పొందారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు గుజరాత్ ,గోవా అసెంబ్లీ ఎన్నికలలో ఎలక్షన్ మేనేజ్మెంట్ విభాగంలో పరిశీలకులుగా పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ఈ నియామకం ద్వారా ఆయనకు పదోన్నతి కల్పించారు.

లూథరన్ చర్చి ఆధ్వర్యంలో బైబిల్ పరీక్ష

విశాలాంధ్ర-ఉండి: ఉండి మండలం ఉండి గ్రామంలోని పెదపేట సెయింట్ పాల్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం స్థానిక చర్చిలో బైబిల్ పరీక్ష నిర్వహించినట్లు సంఘ పెద్దలు, సండే స్కూల్ వారు తెలియజేశారు. సంఘం, సండే స్కూల్ వారు సంయుక్తంగా బైబిల్ పరీక్షలు నిర్వహించినట్లు ఈ పరీక్షకి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుండి దాదాపు 250 మంది అభ్యర్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పరీక్షల్లో మొదటి బహుమతి గా రూ.10 వేలను కే .ధరనిజ రెండవ బహుమతి రూ.7వేలు జి .కరుణ మూడవ బహుమతి రూ.5 వేలు లిల్లీ రోజ్ గెలుపొందినట్లు పరీక్షా నిర్వాహకులు తెలియజేశారు.

మనీ స్కానింగ్

- అడ్డగోలు బిల్లులు... అర్హత లేని టెక్నీషియన్లు
- తనిఖీలు చేపట్టని వైద్య ఆరోగ్యశాఖ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. వీటికి నిబంధనలు ప్రకారం నడపాలనే వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలు ఏమాత్రం పట్టవు. సందు సందుకు, ప్రతి ఆసుపత్రికి అనుబంధంగా స్కానింగ్ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. ఇవన్నీ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశారా అంటే లేదనే సమాధానం వినిపిస్తుంది. స్కానింగ్ కేంద్రం ఏర్పాటు కోసం అర్హత కలిగిన డయాగ్నస్టిక్ సంస్థలు దరఖాస్తు చేస్తే అది ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు...? అక్కడ అన్ని వసతులు ఉన్నాయా..? అనే విషయాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిశీలించి లైసెన్సులు మంజూరు చేయాలి. ఏలూరు, భీమవరంతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పట్టణ ప్రాంతాలలో అడ్డగోలుగా అందిన కాడికి మామూళ్లు తీసు కొని ఇష్టం వచ్చిన రీతిలో స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి రోగుల పాలిట శాపంగా మార్చారు. వాస్తవంగా ఉమ్మడి పశ్చిమలో స్కానింగ్ కేంద్రాలలో వ్యాపార దృక్పథమే తప్ప విధి నిర్వహణ కనిపించదు. ఒక్కొక్క స్కానింగ్ కేంద్రంలో ఒక్కొక్క రేటు వసూలు చేసి రోగుల రక్తం తాగుతున్నారు. సంపా దించే డబ్బులు ఎక్కువ భాగం ఆసుపత్రులకే ఖర్చు చేస్తున్నారు. ఏ జబ్బు వచ్చినా డాక్టర్లు కమిషన్లకు కక్కుర్తి పడి అయిన దానికి కాని దానికి స్కానింగ్ రాసి దండుకుంటున్నారు. తనిఖీలు చేసి క్రమబద్ధీకరించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అర్హతలేని టెక్నీషియన్లతో సమస్యలు : జిల్లాలో ఎక్కువ స్కానింగ్ కేంద్రాలలో అర్హత లేని టెక్నీషియన్లే ఉన్నారు. రోగుల వద్ద నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్న నిర్వాహకులు అక్కడ పనిచేసే సిబ్బందికి మాత్రం నామ మాత్రంగా జీతాలు ఇస్తున్నారు. జిఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులను స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులుగా నియమిస్తున్నారు. మరికొన్ని చోట్ల మిషన్ నిర్వహణపై అవగాహన లేని సిబ్బందితో రోగులకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారు. స్కానింగ్ మిషన్‌లో ఏ జబ్బుకు ఎంత రేడియేషన్‌తో ఏ విభాగానికి స్కానింగ్ తీయాలి..? మిషన్ ఆపరేట్ ఎలా చేయాలి..? అనే విషయాలపై అవగాహన ఉండదు. కడుపు, గొంతు, మెదడు,తల వంటి భాగాలు స్కానింగ్ తీసే సమయంలో అత్యంత జాగ్రత్త తీసుకోవాలి. లేదంటే రోగికి ప్రాణాపాయ స్థితి ఏర్పడే అవకాశం ఉంది.

పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ : మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు ప్రతి 6 నెలలకు ఒకసారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేయాలి. గత రెండేళ్ల కాలంలో అధికారులు స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేసి ఒక్క కేసు కూడా నమోదు చేసిన దాఖలాలు లేవంటే ఏ స్థాయిలో అవినీతి దందా సాగుతుందో అమాత్యులకే ఎరుక. స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేసే గది చాలా ఇరుకుగా ఉండటం, అసలు కేంద్రం ఏర్పాటు చేసే ప్రదేశం చాలా అధ్వానంగా ఉండడం, ప్రతి స్కానింగ్ కేంద్రం వద్ద కనిపిస్తున్న దృశ్యాలు. వీటితో పాటు స్కానింగ్ కేంద్రాల నిర్వహకులు పూర్తిగా వ్యాపార దృక్పథంతో రోగుల వద్ద ముక్కు పిండి వసూలు చేయడం తప్ప ఏమాత్రం సేవా భావం కనిపించదు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తే నిర్వాహకుల డొల్లతనం బయటపడే అవకాశం ఉంది.

పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం ఉపసంహరించాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: ప్రజలపై మోయలేని భారంగా పరిణమించిన విద్యుత్ ఛార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.విద్యుత్ ఛార్జీలు పెంపుకు వ్యతిరేకంగా వామపక్షాల రాష్ట్ర వ్యాపిత ప్రచారంలో భాగంగా శనివారం తణుకు నరేంద్ర సెంటర్లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించి, కరపత్రాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా భీమా రావు మాట్లాడుతూ ప్రజలపై ఎలాంటి భారాలు మోపబోమని అధికారంలోకి వచ్చిన జగన్ తన నాలుగున్నరేళ్ళ పాలనలో రూ. 50వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ప్రజల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా వామపక్షాల చేపట్టిన బషీర్ బాగ్ తరహా విద్యుత్ ఉద్యమానికి వామపక్షాలు సమాయత్తం అవుతాయని భీమారావు హెచ్చరించారు.సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఎం నాయకులు కామన మునుస్వామి,గార రంగారావు, ఎం.గోవిందరాజు,సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు,పుట్టా అమ్మిరాజు, బండి సత్యనారా యణ,అప్పారి శ్రీనివాసరావు, బొద్దాని మురళి, బొద్దాని కృష్ణ కిషోర్ తదితరులు నిరసన, ధర్నా,కరపత్రాల పంపిణీ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యం

- ప్రేమాలయం సేవలు ఎనలేనివి
- కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ దంపతులు

విశాలాంధ్ర-ఏలూరు: వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యమని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ , వారి సతీమణి డాక్టర్ మానస ఏలూరులోని ప్రేమాలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అనాధ వృద్ధులకు తోడూ, నీడై , ప్రేమ ఆప్యాయ తానురాగాలను చవిచూపిస్తూ ఆశ్రయం కల్పిస్తున్న ప్రేమాలయం సేవలు ఎనలేనివని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రశంసించారు. ప్రేమాలయంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ప్రేమాలయం ప్రాంగణంలో ప్రశాంత వాతావరణం నెలకొని ఉండటం ఆరోగ్యదాయకం అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రేమాలయం ప్రాంగణమంతా కలెక్టర్ దంపతులు పరిశీలించి చూశారు.సకల సౌకర్యాలతోపాటు, వైద్య ఆరోగ్య సదుపాయాలు కూడా కల్పిస్తూ, వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రేమాలయం కమిటీ ప్రతినిధులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.ప్రేమాలయంలోని వృద్ధులు అందరికీ పెన్షన్లు అందుతున్నాయా ?అని కలెక్టర్ ఆరా తీశారు.అందని వారికి పెన్షన్లు మంజూరు చేయించే చర్యలు తీసుకోవాలని తమ వెంట వచ్చిన ఏలూరు తహసిల్దార్ సోమశేఖర్ ను కలెక్టర్ ఆదేశించారు. మహాలయ అమావాస్య సందర్భంగా తమ తల్లిదండ్రుల పేరిట ప్రేమాలయంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. వృద్ధులకు కలెక్టర్ దంపతులు ఎంతో అప్యాయతతో తమ స్వహస్తాలతో వడ్డన చేసి ఎంతో ఆనందం పొందారు. కలెక్టర్ వెంట ఏలూరు తహసిల్దార్ సోమశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ప్రేమాలయం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ప్రేమాలయం కమిటీ గౌరవ అధ్యక్షులు టి వి సుబ్బారావు, కార్యదర్శి మురళీకృష్ణ, కమిటీ సభ్యులు చెన్న వెంకట్రామయ్య, ఆలపాటి నాగేశ్వరరావు, గొర్ల రామారావు, కిరణ్, శేషగిరిరావు, చిత్రాలయ రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీకేఎంయూ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో కరువు పరిస్థితులను అధిగమించేందుకు, వలసల నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణమే ప్రారంభించాలని, వ్యవసాయ కూలీలను,పేదలను, రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు)ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు అనంతపురంలో ఈనెల 17వ తేదీన సంగమేశ్వర ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని దీనిని జయప్రదం చేయడానికి భారీ ఎత్తున తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిశెట్టి వెంకట్రావు, కళింగ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిపిఐ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ బినయ్ విశ్వమ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు జల్లి విల్సన్, రాష్ట్ర అధ్య క్షులు సిహెచ్ కోటేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, తదితరులు హాజరవు తారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న వ్యవ సాయ కార్మికులు, పేద రైతులు, ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

CHANGE OF NAME

I, **KORLEPARA VENKATESWARA RAO (NEW NAME), SOMA SURYAM,** Previously called **KORELEPARA VENKATESWARA RAO (OLD NAME),** Resident of Ho.No. 12-2-14, Eeli Nani vari Street, Opp : Ganesh Temple, Kobbarithota, Tadepalligudem Town and Mandal, W.G.Dist, Andhra Pradesh, Now Changed my name from **KORELEPARA VENKATESWARA RAO (OLD NAME) to KORLEPARA VENKATESWARA RAO (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

విద్యుత్ ఛార్జీలతో వేల కోట్లు దోచేస్తున్నారు

విశాలాంధ్ర -భీమవరం: ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, పీక్ టైం ఛార్జీలు, పెనాల్టీల రూపంలో రాష్ట్రంలో ప్రజలను విద్యుత్ ఛార్జీల పేరుతో వేల కోట్లు దోచేస్తున్నారని సిపిఐ భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శనివారం సిపిఐ అధ్వర్యంలో వామపక్షాల శ్రేణులు భీమవరం మండలం నాగిడిపాలెం, నాగేంద్రపురం, కొత్తపూసలమర్రు గ్రామాల్లో విద్యుత్ ఛార్జీలు తగ్గించా లని కరపత్రాల పంపిణీ, ప్రచారం చేసి ప్రజల నుండి సంతకాలు సేకరించాయి. ఆయా కార్యక్రమాల్లో వామపక్షాల నాయకులు నాగిడి శాంతమూర్తి, తిరుమాని చంటి రాజు, నాగిడి తులసీరావు, నాగిడి నాగరాజు, కనుమూరి వెంకటపతిరాజు, తిరుమాని విమలాదేవి, తిరుమాని వనమయ్య, గాది ధర్మరాజు, కొల్లాటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో: షాక్ కొడుతున్న విద్యుత్ చార్జీల భారాలను వ్యతిరేకించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీ ల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పట్టణంలో ఈ నెల 9 నుంచి 14 వరకు విద్యుత్ ఛార్జీలు పెంపు ఉపసంహరించుకోవాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం కల్పించారు. ఈ సందర్భంగా మండల నాగేశ్వరావు మాట్లాడుతూ ఈనెల 15న స్థానిక ఆర్ టీ సి వద్ద విద్యుత్ చార్జీలపై వ్యతిరేక, అనుకూలత ఓటింగ్ జరుగుతుందన్నారు పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోక పోతే రాష్ట్ర ప్రజలతో కలసి బషీర్బాగ్ తరహా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ ,సిపిఎం నాయకులు దాస్యం రాము,బొమ్మిడి కృష్ణ,రావూరి బేబీ,కిలాడీ రవి,లుక్కా సుబ్బారావు పాల్గొన్నారు.



అత్తిలిలో : విద్యుత్ ఛార్జీల బాదుడుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాబోయే ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి సాగనంపాలని సిపిఐ తణుకు పట్టణ ఏరియా కార్యదర్శి టి. అప్పలస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలం ప్రజలకి పిలుపు నిచ్చారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని శనివారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో అత్తిలిలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టి. అప్పలస్వామి, కేతాగోపాలం, మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు భారీగా వసూళ్లు చేస్తూ సామాన్యులను అనేక అవస్థల పాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల విద్యుత్ బిల్లులో యూనిట్‌కు 80 పైసలు చొప్పున పెంచి జనం నెత్తిన గుదిబండ మోపారని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సీపీఐ , సీపీఎం అత్తిలి మండల నాయకులు మంగం పెంటయ్య, కర్రి ధర్మేంద్ర, చిట్టూరి నాగరాజు, రాపాక శ్రీరాములు, జక్కుల మందులు, జోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా 940 ఓట్లు

విశాలాంధ్ర-చింతలపూడి: విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో 970 మంది ఓటర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 940 ఓట్లు, అనుకూలంగా 10 ఓట్లు, చెల్లనివి 20 ఓట్లు వచ్చినట్లు వామపక్ష నాయకులు కంచర్ల గురవయ్య, ఆర్‌వి సత్యనారాయణ, డి. రంగనాథ్ తెలిపారు. ఈ వివరాలను జిల్లా కమిటీ ద్వారా రాష్ట్ర కమిటీకి తెలియపరుస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, పట్టణ కార్యదర్శి ఎస్ కే. జానీ, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, సిపిఎం నాయకులు డి. సత్యనారాయణ, సంకు జానీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా
ప్రజా బ్యాలెట్

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ చార్జీల పెంపు పై ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. శనివారం సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎం ఎల్)న్యూ డెమోక్రసీ తదితర వామపక్ష పార్టీలు ఏలూరు ఆర్ ఆర్ పేట పార్కు వద్ద ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రారంభించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా ఏలూరు కార్యదర్శి ఎ. రవి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె.నాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు పై రాష్ట్ర వ్యాప్తంగా 10 వామపక్ష పార్టీలు వారం రోజుల నుండి ఆందోళనలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కరపత్రాలు పంపిణీ, ప్రజల నుండి సంతకాలు సేకరణ చేపట్టినట్టు తెలిపారు. బిజెపి షరతులు పెడితే వాటిని అంగీకరించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై చార్జీలు పెంచుతున్నదన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు విద్యుత్ సంస్థలకు వచ్చిన లోటు కూడా ప్రజలపై వేస్తున్నారని తెలిపారు. ట్రూ ఆప్, సర్దు బాటు సర్ చార్జీ, అదనపు చార్జీలు ఇలా రకరకాల పేర్లతో చార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. ప్రజా బ్యాలెట్‌కు సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. దాదాపు 600 మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఓటును వేశారు. 600 ఓట్లలో విద్యుత్ చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 588మంది ఓటు వేయగా, 7 గురు అనుకూలంగా ఓటు వేశారు. 5 ఓట్లు చెల్లనివి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్,యర్రా వెంకటేశ్వరరావు, బళ్ళ కనకదుర్గారావు, బుగ్గల ప్రభాకర్, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మావూరి విజయ, కొల్లూరు సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని,సిపిఎం నాయకులు పి. ఆదిశేషు, వి. సాయిబాబు, బి. జగన్నాధ రావు, ఎం. ఇసాక్, ఎస్.సత్య నారాయణ, జి. కోటేశ్వరరావు, జి.యేసు బాబు,అర్. వేణుగోపాల్ శ్రీనివాస్, ఎండి.ఇర్ఫాన్ మస్తాన్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర -ఉంగుటూరు : మండలంలోని నాచుగుంట గ్రామ పరిధిలో విద్యుత్ కోతలతో సాగునీరు అందక ఈనిక, పొట్ట దశలో ఉన్న పంట పొలాలను స్థానిక రైతులు, టీడీపీ నాయకులతో కలిసి ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజ నేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ అసమర్థ ముఖ్య మంత్రి రాజ్యమేలితే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న జగన్ రైతుల పాలిట రాక్షసుడుగా తయారయ్యాడని అన్నారు. నెల రోజులుగా రైతులకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎపుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వలేని జగన్ పరిపాలనకు అనర్హుడవు అంటూ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో తెలుగు రైతు నాయకుడు ఇమ్మని గంగాధర్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

విశాలాంధ్ర - నిడమర్రు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం నిడమర్రు మండలం చానమిల్లి గ్రామంలో గ్రామ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో 35వ రోజు జరిగిన రిలే నిరహార దీక్ష చేశారు. చానమిల్లి గ్రామ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సభ్యులు నిడమర్రు మండల తెలుగుదేశం సభ్యులు దీక్షా శిబిరంలో చేస్తున్న దీక్షకు సంఘీభావంగా ఏలూరు జిల్లా తెలుగు దేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సంఘీభావంగా దీక్ష చేశారు.ఈ దీక్ష లో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల స్వామి, ఆదిరెడ్డి చంద్రరావు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలియజేశారు.

జగన్ పాలనకు చరమగీతం పాడతాం

విశాలాంధ్ర-ఏలూరు: ముఖ్యమంత్రి జగన్ పాలనకు చరమగీతం పాడుదామని వీర మహిళలు హెచ్చరిం చారు. జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీర మహిళలు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై చిల్లర తనంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జగన్ పై ప్రజలు ఉమ్ము వేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పక్కనపెట్టి పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్ల గురించి మాట్లాడడాన్ని వీర మహిళలు తప్పుపట్టారు. సమావేశంలో జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి కావూరి వాణిశ్రీ, కార్యదర్శి కూర్మ సరళ, వన్ టౌన్ వీర మహిళ అధ్యక్షురాలు కోలా సుజాత, టూ టౌన్ వీర మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని రెండు అంగన్వాడి సెంట ర్లను శనివారం విజిలెన్స్ కమిటీ సభ్యుడు కొనే వీర వెంకట సత్యనారాయణ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే పౌష్టికా హారం కూడా రుచిచూచి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరినారు. వంట చేసే ప్రదేశాలను, టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించడం జరిగింది. అంగన్వాడి టీచర్లు తోట దుర్గ , కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-టీ నరసాపురం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని కెనరా బ్యాంక్ మేనేజర్ దత్త సాయి తెలిపారు. బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా జ్యోతి పథకంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్దంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహిం చాలని ఆయన తెలిపారు. విద్యార్థులు బాల్యం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎండి ఆలీ,ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై మండిపడ్డ వీర మహిళలు

విశాలాంధ్ర -ఉంగుటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వేదిక పై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తి గత జీవితం పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం సిగ్గు చేటు అని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ వీర మహిళలు విమర్శించారు. శనివారం ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ వీరమహిళలు, నాయకులు పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి చెప్పుకోవటా నికి ఏమి లేక ప్రతిపక్షాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో వుండి దిగజారుడు వ్యాఖ్యలు సరికాదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ప్రజల్లో వచ్చే వ్యతిరేకత చూసి వారిలో భయం పుట్టిందని, జనసేన పార్టీకి ప్రజల్లో వచ్చే ఆదరణ ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు పంది రాంబాబు, భీమడోలు మండల జనసేన పార్టీ అధ్యక్షులు ప్రత్తి మదన్, వీర మహిళలు చిత్తూరి పార్వతి, అంబటి మాధవి, నిమ్మల మౌనిక, భీమన దుర్గా పల్లవి, వెజ్జు శేషరత్నం,కోటిపల్లి వెంకట పద్మ,తోట ధనలక్ష్మి,తోట శ్రీను,సూరత్తుల అయ్యప్ప,తాడిశెట్టి శివ ప్రసాద్, మద్దాల ఉమ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీని పరామర్శించిన గుడాల గోపి

విశాలాంధ్ర - యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం కనకాయలంక గ్రామంలో వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను చేయించు కున్నారు. ఈవిషయం తెలుసుకొన్న పాలకొల్లు వైసీపి నియోజకవర్గ ఇన్చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) బాధితుడి ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్ కు కొంత ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ పోత్తురి బుచ్చిరాజు, ఉచ్చుల స్టాలిన్ బాబు, గ్రామ సర్పంచ్ మద్దా శ్రీనివాస్, జవగల సువర్ణరాజు, కుక్కల బాలచంద్ర, కళ్యాణం గంగాధర్, విపర్తి నవీన్, నెల్లి ఆనంద్, మోకా ప్రేమచంద్, మందా హరికుమార్, లంక చిరంజీవి, పులి సుబ్రమణ్యం, వీర ఉమాశంకర్, అనిశెట్టి ధర్మారావు, బొంతు వెంకట కర్ణారెడ్డి రెడ్డి, దీపాటి ప్రకాష్, గన్నాబొత్తుల ఏసుబాబు, శీలం వీరబాబు, వలవల ధర్మరావు, పొత్తూరి శ్రీనివాసరాజు, తోటకూర సత్యనారాయణ రాజు, పాలపర్తి సందీప్, నర్సింహమూర్తి, శ్రీధర్, కనకాయలంక గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతూ టి నరసాపురం మండలం బందంచర్ల గ్రామంలో లోకేష్ సేవాదళ్ నాయకులు ఘంటా సతీష్ ఆధ్వర్యంలో శనివారం రాజమండ్రి సెంట్రల్‌జైలు సూపరింటెం డెంట్‌కు మహిళలు పోస్టు కార్డులు వ్రాసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసారని తెలిపారు. జగన్మోహనరెడ్డి ప్రజా క్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిం చారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

లోటస్ స్కూల్ విద్యార్థి భార్గవ్ అండర్ 17 ఫుట్ బాల్ గేమ్‌కు ఎంపిక

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి లోటస్ స్కూల్ లో 9 వ తరగతి చదువుతున్న వి.భార్గవ్ అండర్17 ఫుట్ బాల్ గేమ్ కు ఎంపిక అయ్యాడని పి.ఇ.టి. సిరిపురం గణేష్ తెలిపారు. నల్లజర్ల మండలం దేవరపల్లి గవర్నమెంట్ హై స్కూల్లో అండర్ 17 ఫుట్ బాల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరగాయి. ఈ పోటీలలో 170 మంది పాల్గొనగా 17 మంది విద్యార్థులు ఎంపికైనారని వారిలో లోటస్ స్కూల్ నుండి 9 వ తరగతి చదువుతున్న వి.భార్గవ్ ఒకరని పి. ఈ.టి.శిరవరపు గణేష్ తెలిపారు. ఇలా ఎంపికైన విద్యార్థులు నవంబర్ నెలలో కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని గణేష్ తెలిపారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన వి.భార్గవ్ తండ్రి వ్యవసాయదారు డు కాగా తల్లి గృహిణిగా ఉంటుందన్నారు. లోటస్ స్కూల్ నుండి అండర్17 ఫుట్ బాల్ గేమ్ కు ఎంపిక అయిన భార్గవ్ ను స్కూల్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్, ప్రిన్సిపాల్ ఎస్.ఉమా శ్రీనివాస్ స్కూల్ స్టాఫ్ అభినందించారు.

అంగన్వాడీ కేంద్రానికి కుక్కర్ వితరణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నరసింహారావు పేట లో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి ప్రెషర్ కుక్కర్ ను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పడాల పెద్దిరాజు చేతుల మీదుగా ఈ కుక్కర్ ను అంగన్వాడీ టీచర్ సూర్యకుమారికి అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని పెద్దిరాజు అన్నారు. మనకోసం మనం సభ్యులు పాల్గొన్నారు.

గౌడ సంఘ బలోపేతమే లక్ష్యం

విశాలాంధ్ర - మండవల్లి: గౌడ సంఘం సంఘటితంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకుంటే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీ యంగా అభివృద్ధి చెందుతామని గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోసిన చెంచు రామారావు పేర్కొన్నారు. లోగుముడిలో నియోజకవర్గ నాలుగు మండలాల నూతన కార్యవర్గ ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా జోగి సురేష్, అధ్యక్షుడిగా పోలగని నాగరాజు, కైకలూరు మండల అధ్యక్షుడుగా కట్టా నాగబాబు, మండవల్లి మండల అధ్యక్షుడిగా బుర్ర సత్యనారాయణ, ముదినేపల్లి మండల అధ్యక్షుడిగా పరస కనకారావు కలిదిండి మండల అధ్యక్షుడిగా కట్ట పాండులను ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. ప్రభుత్వ సహకారం లేకపోయినా 13 జిల్లాల్లోని గౌడ సంఘం అభివృద్ధికి నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. ఇందులో భాగంగా రూ.6 కోట్లతో అమరావతిలో ప్రత్యేకంగా హాస్టల్లో నిర్మిస్తున్నట్లు గీతం కార్మికులు ప్రమాదంలో మృతి చెందితే గౌడు బందు కింద సహాయాన్ని ఇస్తున్నట్లు ఇందుకోసం రూ. 50 లక్షలు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులు బొర్ర చలమయ్య, పరసా ఏడుకొండలు, వీరమల్లు నరసింహారావు, మరీదు నాగయ్య, బొల్ల శ్యామల రాజు గౌడ్, కట్టా నాగరాజుగౌడ్, మోదుగమూడి లక్ష్మణరావు 4 మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ పూజలు

విశాలాంధ్ర-ఆకివీడు : తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై మోపిన అక్రమ కేసులు తొలగి మచ్చలేని చంద్రుడిలాగా బయటకు రావాలని కోరుతూ శనివారం ఆకివీడు స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో తెలుగు మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, బొచ్చు సరళ కుమారి, బొర్రా సుజాత, కిమిడి అరుణ కుమారి నాగరాజు, బొల్లా వీర శ్వేత శేషుబాబు, చొక్కాకు మహేశ్వరి, చిన్నారి బిబి, బత్తుల శ్యామల, ఇల్లాపు కృష్ణవేణి, నౌకట్ల రామారావు, దుబా సురేష్, పమ్ము అజ్మల్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో రామశింగవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర -పెదవేగి: జిల్లా స్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలో పెదవేగి మండలం రామశింగవరం జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు సత్తాచాటారు. అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో తణుకులో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన చలమాల దివ్యశ్రీ, అండర్ 17 విభాగంలో దుక్కిపాటి సంజనలు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పిడి జమ్మా రామకృష్ణలను శనివారం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి పద్మావతి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పరసా నాగార్జున, వెలివెల శ్రీను, మేకా లక్ష్మీనారాయణ, నీలిమ, మురళి తదితరులు పాల్గొని విద్యార్థు లకు అభినందనలు తెలిపారు.

విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని ధర్నా

విశాలాంధ్ర - జీలుగుమిల్లి: మండలంలోని పి.నారాయణపురం సబ్ స్టేషన్ వద్ద శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. విద్యుత్తును సక్రమంగా సరఫరా చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిరంతరాయంగా 9 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ఆయన కోరారు. అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. టొబాకో వేరుశనగ వరి పంటలు రైతులు లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తున్నారని అన్నారు. ఇప్పటికే వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయని ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న తమకు విద్యుత్ కోతలు కూడా అధికమవడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

చంద్రబాబు అబద్దాల కోరు

విశాలాంధ్ర-ఆకివీడు : ప్రజలకు అబద్ధాలు, మాయ మాటలు చెప్పి మభ్య పెట్టడంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబును మించిన వారు లేరని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ వైకాపా ఇంచార్జ్ పివి ఎల్ నరసింహారాజు అన్నారు. శనివారం స్థానిక రైస్ మిల్లర్స్ ఫంక్షన్ హాల్ లో ఆకివీడు మండల స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జడ్పీటీసీ యండగండి శ్రీను మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే రాష్ట్రానికి జగన్ కావాలని అన్నారు. ఎంపీపీ కటారి జయలక్ష్మి, ఆకివీడు వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ షేక్ రసూల్ బీబీ హుస్సేన్, ఆకివీడు నగర పంచాయితీ ఛైర్మన్ జామి హైమావతి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని విధంగా బీసీలకు పెద్దపీట వేసి బీసీలకు అండగా ముఖ్యమంత్రి జగన్ నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ ఛైర్మన్ కేశిరెడ్డి మురళి, రైతు నాయకులు నంద్యాల లక్ష్మీ సీతారామయ్య, మోటుపల్లి గంగాధర్, ఆకివీడు మండల అధ్యక్షులు అన్యం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంధి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర- వీరవాసరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే పార్టీ ఒక్క వైసిపి మాత్రమేనని, అటువంటి పార్టీలో ఎమ్మెల్యేగా ఉంటూ నిరంతరం నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి గ్రంధి శ్రీనివాస్ అని ఎమ్మెల్యే తనయుడు గ్రంధి రవితేజ తెలిపారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా స్థానిక తూర్పు చెర్వు సెంటర్ లో మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కడలి ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.మరో ముఖ్య అతిధి ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హయాంలో నియోజక వర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి, ప్రజల మనిషి, నిత్యం పేదప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించి నియోజక వర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు కేకును కట్ చేసి గ్రంధికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, జేసిఎస్ కన్వీనర్, మాజీ జడ్పిటిసి మానుకొండ ప్రదీప్ కుమార్, సంచార జాతుల జిల్లా అధ్యక్షులు,విద్యాకమిటీ ఛైర్మన్ చుండూరి ముసలయ్య, సర్పంచ్ లు చికిలే మంగతాయారు, గెద్దం భారతి, సైదు శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాసరాజు, గోపీరాజు, గెద్దం భాస్కరరావు,మద్దాల బాబులు, నూకల కనకారావు, మద్దాల మురళి, ఇతర వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైన వాసవి మాత ఆలయం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 56వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఎంతో అందంగా వైభవంగా నిర్వహిస్తున్నామని, పట్టణ ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తాడేపల్లిగూడెం శ్రీ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు అన్నారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో ఎంతో ఆధునీకరణ అభివృద్ధి సహాయ కార్యక్రమాలు నిర్వహించమని ప్రకటనలో తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘం పూర్వాధ్యక్షులు మరియు ఉత్సవ కమిటీ అధ్యక్షులు వబిలిశెట్టి నటరాజ్ మాట్లాడుతూ గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు సహాయ సహకారాలతో ఈ సంవత్సరం అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాల ఆధునీకరించామని బ్రహ్మశ్రీ కొంపెల్ల శ్రీరామచంద్రమూర్తి రామం వారి ఆధ్వర్యంలో 20 వేద విద్వంసల పర్యవేక్షణలో ఈ దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఈ పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం చేస్తున్నామని నటరాజ్ తెలియజేశారు.

పవన్‌పై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉపసహరించుకోకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఇంటికి సాగనంపుతామని గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులు వీర మహిళల ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సువర్ణ రాజు మాట్లాడుతూ సామర్లకోటలో జరిగిన సభలో పవన్ కళ్యాణ్ పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. రాజకీయరంగంలో ఉన్నవారు కేవలం రాజకీయాలే మాట్లాడాలని వ్యక్తిగత దూషణ పనికిరాదు అన్నారు. పవన్ కళ్యాణ్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించు కోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ సీనియర్ నేతలు అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, పప్పు వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య ఊహించని రీతిలో పెరుగుతోంది. ప్రతి శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడం తెలిసిన విషయమే. ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం. ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడి విశ్వవ్యాప్తం కావడంతో ఇటీవలి కాలంలో శనివారం వస్తున్న భక్తుల సంఖ్య భారీ స్థాయిలో ఉంటోంది. ఈ శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయినప్పటికీ భక్తులపై ఆ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి తొలి హారతి సమర్పించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు వేకువజాము నుంచే నాలుగు మాడ వీధుల్లో ప్రదిక్షణలు ప్రారంభించారు. దేవస్థానం ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు. భక్తులకు ప్రసాద వితరణ, భారీగా అన్న దానం చేసారు. శనివారం రోజున ప్రత్యేక దర్శనం ద్వారా ఆదాయం రు.6,46,600, అన్నప్రసాద విరాళం ఆదాయం రు.12,02,483, సేవలు వల్ల ఆదాయం రు.20,050లడ్డూ విక్రయిం రు.4,96,665, విరాళములు ద్వారా ఆదాయం రు.3,791, వెరసి రు.31,30,203లు ఆదాయం వచ్చినది అని ఆలయ ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

వేలివెన్నులో బాబుతో నేను

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రజలతో మమేకమై బాబుతో నేను కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉండ్రాజవరం మండలం టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని వేలివెన్ను లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ప్రజా వేదిక నిర్వహించి, అనంతరం గ్రామంలోని వీధి వీధికి తిరిగి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిరంకుశ విధానాలను ఎండగట్టేలా ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ లు, వార్డ్ మెంబర్లు, తెలుగుదేశం, జనసేన పార్టీ ల మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ మహాసభలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు ఈనెల 19వ తేదీన మండపేట బాలు కన్వెన్షన్ హాల్లో జరుగుతాయని రాష్ట్ర సభ్యురాలు కే.కృష్ణవేణి తెలియజేశారు. ఈ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి పాల్గొంటారని ఈ మహాసభలకు ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మహాలయ అమావాస్య మహా అన్నదానం

విశాలాంధ్ర - తాళ్లపూడి : అన్ని అమావాస్యల లోకి మహాలయ అమావాస్య చాలా ప్రాధాన్యత గలది అని, మన పుట్టుకకు, వంశానికి మూలకారణమైన పితృదేవతలు భూలోకానికి వచ్చి మనం వారిపై చూపించే అభిమానాన్ని గౌరవాన్ని చూసి ఆశీర్వదించే రోజుగా పురాణాలు చెబుతున్నాయని, మహాలయ అమావాస్య రోజు శనివారం చేసే అన్నదానం పితృదేవతల కు తృప్తినిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారకులు పరస రాధాకృష్ణ పేర్కొన్నారు. మహాలయ అమావాస్య రోజున అన్నదానం ప్రాధాన్యతను గుర్తించి తాళ్లపూడి పుష్కర్ ఘాట్ వద్ద ఉన్న పురాతన గౌతమేశ్వర స్వామి వారి సన్నిధిలో శ్రీ గౌతమేశ్వర మరియు రమా సత్యనారాయణ స్వామి ఆలయ పరిరక్షణ మరియు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ర భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడి ఆరోగ్యంపై జగన్ కుట్ర

విశాలాంధ్ర - రావులపాలెం : చంద్రబాబునాయుడి ఆరోగ్యంపై జగన్ కుట్ర పన్నారని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బండారు సత్యానందరావు విమర్శించారు. రావులపాలెంమండలం ఊబలంక గ్రామంలో పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్న సత్యానందరావు మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలో భాగంగా అక్రమ అరెస్టు చేసిన చంద్రబాబు నాయుడిని అధికారం అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడి ఆరోగ్యం పట్ల ఆయన సతీమణి భువనేశ్వరి ఆందోళన చెందుతున్నా జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తున్నదని అన్నారు డాక్టర్లు విడుదల చేయాల్సిన హెల్త్ బులిటెన్ పోలీసు అధికారి సంతకంతో విడుదల చేయడం ఏంటని సత్యానందరావు ప్రశ్నించారు. తక్షణమే చంద్రబాబుకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలువూరి సతీష్ రాజు, చింతా భాస్కరరెడ్డి, మేడపాటి గంగిరెడ్డి, దండు విజయరామరాజు, కాసురెడ్డి, శ్రీరామారెడ్డి పాల్గొన్నారు.

మద్యం హామీ మరిచిన జగన్మోహన్ రెడ్డి

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా మద్యం రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు కల్తీ మద్యం మార్కెట్లో అమ్మతూ నేడు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి జోనల్ ఇన్చార్జి కాశీ విశ్వనాథ్ రాజు ధ్వజమెత్తారు. అదేవిధంగా కల్తీ మద్యం వలన మద్యానికి బానిసైన కాయ కష్టం చేసుకునే బడుగు బలహీన, పేద ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దశలవారీగా మద్యం రద్దు చేస్తారంటే ఫైవ్ స్టార్ స్థాయిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తారని అనుకున్నాం కానీ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తుందని అనుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా రహదారులు అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన జాతీయ రహదారులు తప్ప రాష్ట్ర ప్రభుత్వ రహదారులు అభివృద్ధిలో ఏమీ లేదని రాష్ట్ర రహదారులు గుంతలుగా మారాయని అన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు బిజెపి ప్రభుత్వ హస్తం ఉందని వైఎస్ఆర్ సీపీ చేస్తున్న ఆరోపణలులో ఏ మాత్రం వాస్తవం లేదని సీఐడీ అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని అన్నారు, పంచాయితీ నిధులను ఏ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసిందని ఎద్దేవా చేశారు. అదేవిధంగా శుక్రవారం తెలంగాణ పర్యటనలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లోకేష్ కలవడం పట్ల బిజెపి ప్రభుత్వంతో కలిసి పని ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంత్రి సజ్జల రామకృష్ణ మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేయడం సజ్జల రామకృష్ణకు తగదన్నారు, ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా మానేపల్లి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, అడబాల సత్యనారాయణ, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎలిమినేటి మాలకొండయ్య, టీచర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఇళ్ళ నారాయణ, జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ పొట్లూరు రామ్మోహన్ రావు, సీనియర్ నాయకులు ఆర్‌వి నాయుడు, రావూరి సుధా అనకాపల్లి జిల్లా ఇన్చార్జి కర్రీ చిట్టిబాబు, కిసాన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ చెకురి రమేష్ వర్మ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, మహిళా మొర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకామర్రి కస్తూరి, కిసాన్ మార్చ్ జిల్లా అధ్యక్షుడు విల్ల దొరబాబు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, సలాది శేఖర్, ఎంర్ర బులి అబ్బులు, కోలా సత్యనారాయణ, కేవీవీ సాయిరాం, కర్రీ రాజు, సుంకర సాయి, ఈశ్వర్ గౌడ్, బొంతు శివాజీ, అడిగెల తేజ వెంకటేష్ పాల్గొన్నారు.

'సదా మీ సేవ సేవ' పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో వంటి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ అవార్డు గ్రహీత సలాది కృష్ణ అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రమైన బజారువిధి రామాలయం వద్ద శనివారం సదా మీ సేవలో సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి సోమేశ్వర రావు, జి సత్యానందం, బేరి రాంబాబు, శిరసాల మణికంఠ జ్యోతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలకు వినూత్న నిరసన

విశాలాంధ్ర - కొవ్వూరు : జనసేన అధినేత పవనకళ్యాణ్ పై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలుగుదేశం, జనసేన నాయకులు మహిళా కార్యకర్తలు చీపుర్లతో నిరసన తెలియ చేశారు...ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం ఖభడ్దార్ జగన్ అంటూ నినాదలు చేశారు.. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణరావు, మాజీ ఎమ్మెల్యే,కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ టీవీ రామారావు జనసేన మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు త్వరగా కోలుకోవాలని పూజలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : రాజమండ్రి జైల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రబాబునాయుడు త్వరగా కోలుకోవాలని ఆయురారోగ్యా లతో ఉండాలని, అక్రమ కేసులు కొట్టివేయాలని నగర పంచాయతీ పరిధిలోని శ్రీ అభయాంజనేయ స్వామిఆలయంలో రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడి, డ్వాక్రా సాధికార కమిటీ సెక్రటరీ వాసంశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో మహిళా నాయకురాలు ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పటించారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి మల్లీశ్వరి, శ్రీలత, అరుణ్ కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు నవగ్రహ హెూమం

విశాలాంధ్ర - జగ్గంపేట : టిడిపి అధినేత చంద్రబాబు ఆరోగ్యం మెరుగుపడాలని, త్వరగా విడుదల కావాలని జగ్గంపేటలో నిర్వహిస్తున్న నవగ్రహ హెూమం మూడోవ రోజుకు చేరుకుంది. టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తలపెట్టిన తొమ్మిది రోజుల నవగ్రహ శాంతి హెూమంలో భాగంగా మూడవరోజు మల్లిశాల క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు దంపతులు హెూమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ హాజరై ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ న్యాయపోరాటం, ధర్మపోరాటంతో పాటు భగవంతుడి ఆశీస్సులతో చంద్రబాబు సత్య శీలుడుగా బయటికి రావాలని, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలతో రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని ఈ నవగ్రహ శాంతి హెూమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, సర్వసిద్ధి లక్షణరావు, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.